# చీకటి తెరలు

రచన :
శ్రీ ఆదూరి వెంకట సీతారామమూర్తి.

సాయంకాలం అరయింది. నీరెండ మిగిల్చిన కొద్దిపాటి వెలుగులో విచ్చటంటున్న లేత అరిటాకులు సొగసులీనుతున్నాయి. గాలి లేయకుండా నిటారుగా గుబురుగా ఎదిగిన చెట్లు వెలుగును వడకడుతున్నాయి.

'ఇల్లాలు లేని యిల్లయిపోయింది''.

ఆరు బయట కూర్చున్న రాఘవయ్యగారు తనలో తనే గొణుక్కున్నాడు. అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూస్తుంటే తూర్పున వుదయించే సూర్యుడు గుర్తొచ్చాడు_అతనిలో ఆవేశం పెరిగింది.

యౌవనంలో తనలో పడుచుకోరికలు పరవళ్ళు తొక్కినపుడూ, పెళ్ళి పందిరిలో సిగ్గుతో అందాలు సంతరించుకున్న వనజపై వలపు బాణం ప్రయోగించినపుడూ, మంగళసూత్రం కట్టిన మర్నాడు పూల్లెల పాన్పుమీద తెల్లని జాబిల్లి వెదజిమ్మే పాల కాంతుల మెత్తని వెలుగులో రత్నాల భరిణలోని అందాల దంతపు బొమ్మలాంటి వలపుల వనజ తన చెంత నిల్చినపుడూ — ఆక్షణాలు, ఆక్షణాల అనుభవాలే తన జీవితంలో శాశ్వతమవ్వాలనుకున్నాడు.

కానీ_ తనదనుకున్న వనజ తన వలపుల వాకిట అల్లంత దూరాన నిలబడి తన కోర్కెల్ని వమ్ముచేసి, తన ఆశాజ్యోతుల్ని ఆశల హర్మ్యాల్ని క్షణంలో కూల్చేసినా తను బాధపడడు.

'' ఈ శరీర సంబంధం నాకిష్టంలేదు_ కుళ్ళులో ఆ బురద గుంటలో సంసారం చేస్తూ బ్రతకాలంటే నాకసహ్యం'' అని వనజ అన్నపుడు తనలో ఆశ్చర్యమే కలిగింది గాని 'అటువంటి దానివి పెళ్ళెందుకు చేసుకున్నావ్' అని సాహసించి అడగ లేకపోయాడు. యేనాటికైనా ఆమె మనసు మారకపోతుందా అనుకున్నాడు.

ఆరోజుకోసం ఎదురు చూశాడు. చాలసార్లు సున్నితంగా ఆమెను మందలించాడు యేమైనా_తన వైవాహిక జీవితం అందరూ దీవించినట్లు మూడు పూవులారుకాయలు కాలేదు. మోడు బారిపోయింది.

తనవల్ల వంశం వృద్ధి చెందాలనీ తనకు పుట్టబోయే ఆడపిల్ల యింటికే వెలుగు తేవాలనీ ఆశపడ్డ తల్లికోర్కె తను తీర్చలేకపోయాడు.

వనజను కట్టుకోడంవల్లనే తీర్చలేకపోయాడు. ఇటువంటి స్త్రీలుంటారని తన కంతకుముందు తెలియదు.

కానీ...కానీ...తన సుఖం కోసమేలా వున్నా ఇంటికి తనొక్కడే కొడుకు. పెద్దయినా, చిన్నయినా, ఆడయినా, మగయినా...కన్నవారి ఆశలను తీర్చలేకపోయాడు...చాటుగా తల్లి, దేముళ్ళకు ముడుపులు కట్టడం తనకు తెల్సు. యేమైతే నేం ఆ దిగులుతోనే కాకపోయినా తల్లిపోయింది. కానీ ఆమెమహా కోర్కె మాత్రం పోలేదని తనకు తెల్సు.

కానీ అప్పుడు తను పుట్టెడు దుఃఖంలో మునిగి వున్నప్పుడు కనీసం సానుభూతైనా ప్రకటించే మరోవ్యక్తి లేనప్పుడు కనీసం చీమకుట్టినట్లైనా లేని వనజను చూసి వనజ ప్రవర్తన చూసి...తనకు జీవితంలో మొదటిసారి ఒకవ్యక్తి మీద అదీ తన జీవిత సహధర్మచారిణి మీద అసహ్యం కలిగింది.

బాధ కలిగింది. అదీ తను బాహాటంగా వ్యక్తం చేయలేదు.

'' ముసలావిడ ఇప్పుడు పోకపోయినా, మరోనాడు పోయేదే_ బ్రతికున్నాళ్ళూ సంతానమో, సంతానమో అన్నబాధ తప్పితే మరోటి లేదు.''

అవే మాటలు ఎంత వెటకారంగా...ఎంత అసహ్యంగా అంది.

అప్పుడూ భరించాడు.

కానీ భరించి... ఒదిగొదిగి ... తనసంసారం బైట ప్రపంచానికి తెలియ కూడదనుకుని తాపత్రయపడి... యేం సాధించాడు తను ?

రాఘవయ్యగారి కళ్ళలో నీళ్ళు నిలిచాయి. ఆలోచనల్లో తను గమనించనే లేదు...వీధి దీపాలు వెలిగించారు ఓమాదిరి చీకటి చుట్టూ అవహించింది.

'' బాబుగారూ బైట మంచుపడుతోంది కుర్చీ లోపల వెయ్యమంటారా'' రామయ్య మాటలకు పూర్తిగా యీలోకంలోకి వచ్చాడు. పదిరూపాయలకు పనిచేసే మనిషే అయినా రామయ్యనడతలో, మనసులో ఎంత ప్రేముంది ఎంత గౌరవముంది!

కానీ అవి తను పొందవలసిన వారిదగ్గర శాశ్వతంగా

పొందలేకపోయాడు అదే చింత. వద్దనుకున్నా ఎప్పు డోప్పుడు యేదో రోజు–యేదో సందర్భంలో తన మనసులో అది కలుక్కుమంటూనే వుంటుంది.

కుర్చీ లోపలవేసి వేళప్రకారం తనకు భోజనం పెట్టి వెళ్ళిపోయాడు రామయ్య.

రామయ్య తనకు నమ్మినబంటు. తన బాగోగులు చూసి తన మనసు తెల్సుకుని ప్రవర్తిస్తాడు. అందుకే జీతం తక్కువే యిచ్చినా, మరోరూపంలో ముట్టజెప్తూనే వుంటాడు.

తనకు మాత్రం యెవరున్నారు గనుక?...

కిటికీ ప్రక్కగా పట్టెమంచం మీద వెల్లకిల్లా పడుకున్న రాఘవరావుగారి కెందుకో నిద్రరాలేదు.

తటుక్కున ఓ ఆలోచన మెరిసింది. లేచి నెమ్మదిగా బీరువాదగ్గరకు వెళ్ళాడు రాఘవయ్య. బీరువా తీసి బట్టలక్రింద వున్న డైరీ బైటకు తీశాడు. డైరీ మధ్య పేజీలో యేదోరాసి మళ్ళీ యధాస్థానంలో పెట్టబోతూ జ్ఞాపకమొచ్చిన వాడిలా మళ్ళీ డైరీ తెరిచి కవరు సొరుగులోని నాలుగు మడతల కాగితాన్ని బైటకు తీసుకున్నాడు.

అది ఇరవై యేళ్ళనాటి కాగితం.

అది చూస్తేనే గతం ఎంతభయంకరమైనదో తెల్సుకోవచ్చు.


గతాన్ని తల్చుకు బాధపడేకంటె బ్రతికినన్నాళ్ళూ మరో ఆలోచనలేక సుఖపడదామనే యీ మధ్య దాన్ని తీయడం మానుకున్నాడు.

డైరీ రాయటం ఎప్పుడో మానుకున్నాడు. ఎందుకో ఈరోజు మళ్ళీ అన్నీ గుర్తుకు వస్తున్నాయి. ఇరవైయేళ్ళ క్రితం, తనతల్లిపోయిన రెండేళ్ళ తర్వాత డబ్బుకోసం హోదాకోసం సంఘంలో పరువు కోసం తనుకట్టుకున్న వనజ తన జీవితంలో దీపాన్ని కాక ధూపాన్ని రేపిన వనజ మనిషిపై, మనిషికి చూపాల్సిన సానుభూతి అభిమానం చూపలేని వనజ, దాంపత్య జీవితంలో కాక కంటరి బ్రతుకులో యేదో ఆనంద ముందని గుడ్డిగ నమ్మిన వనజ__

తమ యిద్దరి మధ్య నుండే బంధాన్ని ఒక ఉత్తరంలో తేల్చేసి, తెంచేసి వెళ్ళిపోయింది.

అప్పుడు నిజంగా, తను బాధపడ్డాడు. తను సుఖపడలేకపోయినా; కనీసం ఆమైనా సుఖపడుతోందని ఇన్నాళ్ళూ భావించాడు.

కొంత కొంతమంది జీవితాలు ఒకరిని సుఖపెట్టలేవు



★

కౌముదీ పిక్చర్స్ వారి
రంగుల చిత్రం
"రామ బాణం," లో
శోభన్ బాబు, జయప్రద.

★

సుఖపడనూ లేదు వెళ్తూ వెళ్తూ ఊరికేపోక ఉత్తరం రాసి వెళ్ళింది వనజ అది చూసుకుని తను జీవితాంతం ఏడ్వాలని తనకున్న ప్రేమలో, మమకారంలో అరవయ్యో వంతన్నా వనజ కుంటే ఆమె యీపని చేసేదేనా అన్పిస్తుంది.

తన జీవితం ఆమెకు సరిపడలేదు ఆమెకు ఈ యిరుకు జీవితం పడదు.

అలానే సరిపెట్టుకున్నాడు.

వనజలేని లోటు తనకట్టే తెలియలేదు. తనకోసం ఆమె ప్రత్యేకించి చేసిందేమీ లేదు ఒక్కొక్కప్పుడాలోచిస్తే అందానికే తను గౌరవమిచ్చాడేమో అన్పిస్తుంది.

చూస్తూండగానే తన తలలో అక్కడక్కడ తెల్ల వెంట్రుకలు చోటు చేసుకున్నాయి. కళ్ళ కింద నలుపుదనం, మెడల క్రింద ముడుతలు, మెత్తబడిన జబ్బలు తనను మరోదశలోకి తెచ్చి తనకు పెద్దతనాన్ని సంపాదించాయి.

వనజ వెళ్ళిన ఆరేళ్ళకు కాబోలు ఎవరో తెగించి ధైర్యంగా సూచించారు జీవితం సుఖమయం చేసుకోమని తనకా కోరిక మరి కలగలేదు.

కె. పి. జి. వారి అపూర్వ కానుక!!

* రాజు ఇజిప్షిన్ * టిప్‌టాప్ ప్లైన్.
* గోరా ఇజిప్షిన్ * చిల్డ్రెన్
* గోల్డన్ డాలర్ * కె. పి. జి. ఇంటర్‌లాక్

మరియు ఇతర రకాలకు ప్రసిద్ధి చెందిన పేరు

"కె. పి. జి."

K. P. G. Knitting Co.

4/2, Harvey Road :: TIRUPUR-638601

# చిట్టిపాప - చిరునవ్వు

★

మా చిట్టి పాపాయి కళ్ళు తెరచినది
పువ్వులన్నీ కూడ వికసించినవి.
రంగురంగుల పూలు ఊగాడసాగినవి;
పరుగెత్తివచ్చినవి గువ్వలన్నీ కూడి
నీలి మబ్బుల్లోంచి కిల కిలారవముతో.

♦ ♦ ♦

చెంతనున్న ఏటి ఒడ్డుపై పాపాయి
చిరునవ్వు చిందేటి పెదవులు విప్పినది,
పకపకా నవ్వినది చిట్టి పాపాయి–
రంగురంగుల పూలు తలలెత్తి నవ్వినవి,
రివ్వున ఎగిరిన గువ్వలూ నవ్వినది.

♦ ♦ ♦

చిరునవ్వు శబ్దాలు జగమంత పారినవి
ఏరువై సాగినవి; గగనానికెగసినవి;
పాపాయి నవ్వువిని వేళ్ళన్ని చేరినవి;
చెంగున ఎగురుతూ కుందేళ్ళు వచ్చినవి.
పాపాయి కోసమే శ్రీకృతి వెలసినది.
పాపాయి కోసమే ప్రకృతి నవ్వినది.

♦ ♦ ♦

మాచిట్టి పాపాయి చిరునవ్వునవ్వినది;
పూలు, గువ్వలు, కేళ్ళు పిచ్చిగా నవ్వినవి;
పారిన సెలయేరు పొంగిపొరలినది;
ఎదురుగా కొండల్లో హరివిల్లు విరిసినది;

♦ ♦ ♦

కుదురుగా కోయిల కంఠమెత్తినది.
మాట తెలియని పాప కేక వేసినది,
కేకయ్ మాటగ మారిపోయినది
కోయిల పాటతో కలసిపోయినది
పాపాయి లీనమై మళ్ళీ నవ్వినది.

—శ్రీమతి తామాడ రామాయమ్మ.

తనలో కోర్కె ఎప్పుడో సమాధైంది. ఆ తర్వాత తనకా ఆలోచనా లేదు. ఎవరూ గుర్తు చేయనూ లేదు.

గోడ గడియారం పదిగంటలు కొట్టి పూరుకుంది. ఆలోచన్లోంచి తేరుకుని తలుపులువేసి లైట్లార్పి పడుకున్నాడు రాఘవయ్యగారు.

ఆలోచన్లలోనే మగతగా మాగన్ను పట్టింది.

అర్ధరాత్రి...తలుపు శబ్దమైనట్లయితే వులిక్కిపడి లేచారు. గుండెలు దడదడ కొట్టుకున్నాయి. దడతగ్గే వరకూ మంచంమీదే కూర్చున్నాడు. మళ్ళీ ఆశబ్దం విన్పించ లేదు.

ఏ ఆలోచనలో వుంటే మనసుకూడ అదే ఆలోచనలో కలలల్లుతుంది. కాకపోతే ఎవరున్నారు తనకోసం అర్ధరాత్రి రావడానికి? నెమ్మదిగా లేచి కూజాలోని నీళ్ళువంచుకు తాగి లైటువేసి వీధితలుపు తీసి నిల్చున్నాడు.

ఎక్కడా ఏ సంచారమూ లేదు.

నిరాశాజీవిలో వెలిగివెలిగి సన్నగిల్లిన ఆశాజ్యోతుల్లా వీధి దీపాలు మినుక్ మినుక్ మంటున్నాయి.

వీధి తలుపులు వేసి మంచంమీద వాలిపోయాడు రాఘవయ్యగారు. తను కావాలని తలుపులు మూసి వేశాడు. అవును_

తన వనజ వస్తుందని ఎన్నోరోజులు తన హృదయ కవాటాలతో పాటు, ఇంటి తలుపులు కూడ తెరిచి వుంచాడు.

కానీ అప్పుడు రాలేదు వనజ.

సరిగ్గా పదేళ్ళక్రితం_

తన హృదయ కవాటాలు మూసుకు పోయాక, తనలో సెన్సిటివ్ సెన్స్ పోయాక శృంగార వాంఛ చచ్చి పోయాక _ విసుగెత్తిన వంటరి జీవితంలో అలవాటుపడి చాలదూరం పయనించాక...మళ్ళీ__

క్షమించమనీ...తప్పంతా తనదేనని...భర్త తోడు లేని స్త్రీకి సంఘంలో గౌరవం లేదని తెల్సుకుని, అనుభవించి ప్రాధేయపడితే మాత్రం?

దాంపత్య జీవితంలో పొందే హాయినీ ఆనందాన్నీ విశ్రాంతినీ ఇప్పుడు కావాలనుకుంటే మాత్రం?

మళ్ళీ ఎలా...అందుకే...అందుకే తను తనింటి తలుపులు మూసి వేశాడు. వనజను నిరాకరించాడు. మనసు రాయి చేసుకున్నాడు. యేడ్చియేడ్చి...కళ్ళు ఎర్రబడే దాక మరీ యేడ్చి...వెళ్ళిపోయింది. వనజ...వెళ్ళింది మళ్ళీరాలేదు. 'యేదన్నా అఘాయిత్యం' అనే ఆలోచనే రాలేదు తనకు.

తను గుండె నిబ్బరం చేసుకున్నాడు.

నిజంగా వనజకు తనంటే ప్రేమేవుంటే లేక కలిగితే అలా మళ్ళీ వెళ్ళిపోగలిగేదా?

తన మనసు మార్చలేకపోయేదా? రాఘవరావుగారి కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. యేమీ అనుభవించకుండానే తన జీవితం గడిచిపోయింది. తనతోసరి తనవంశం. బాధగా కళ్ళు మూసుకున్నాడు. అక్కడికక్కడే తృప్తి. శరీరం తేలికైనట్లయింది.

♦ ♦ ♦

ఆ మర్నాడు_

బాలభానుని అరుణకిరణాలింకా లోకంలోకి చొచ్చుకురాక పూర్వం ఆకాశమంతా మేఘావృతమై ప్రకృతి పిలుపుకు ఎదురు చూస్తున్న వేళ గేటు తీసుకుని లోనికి అడుగుపెట్టిన రామయ్య మెదడులో వేయిప్రశ్నార్థకాలు.

రాఘవయ్య గారి జీవితంలో తారసపడి జీవితాంతం నిలిచిన విషమ సమస్యలనే చీకటితెరలు శాశ్వతంగా విడిపోయాయనీ, లేమిలో పుట్టి లేమిలో పెరిగి తనచుట్టూ ఆవహించిన పేదరికమనే చీకటితెరలను చీల్చుకుని బైటకు రాలేని రామయ్య బ్రతుకులో వెల్గురేఖలు పొడచూపాయనీ పాపం!

రామయ్యకేం తెల్సు? తలుపు బాదిబాది దొడ్డిగోడ మీంచి లోపలికి దూకి 'బాబుగారూ' అన్నాడు. ఆ కంఠంలో జీరవుంది. రాఘవయ్యగారి పట్ల ప్రేమవుంది. భయంవల్ల యేర్పడ్డ వణుకువుంది.

రాఘవయ్యగారి వంశానికి వారసుడు కాకపోయినా, ఆస్థికి వారసుడైన రామయ్యకళ్ళలో నీళ్ళు నిలిచాయి.

అప్పటికి చీకటి తెరలింకా తొలిగిపోలేదు!!!

---

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులు కాదు. __సంపాదకుడు.

---